నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 8 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్వగృహంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

## 45 వేల ఉద్యోగాలేవీ?

చెన్నూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే వివేక్ ఇచ్చిన హామీలు ఏమైపోయాయని క్యాతన్‌పల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సభలో బాల్క సుమన్ ప్రశ్నించారు. 45 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఒక్కటైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. పెద్ద ఇండస్ట్రీ, మైనింగ్ యూనివర్సిటీ, సెమీ అగ్రికల్చర్ యూనివర్సిటీ, మండలానికో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇవన్నీ ఏమైపోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో నెల రోజులకు ఒక మంత్రి చెన్నూర్‌కు వచ్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తే.. ఇప్పుడు ఒక్క మంత్రి కూడా రావడం లేదన్నారు. అభివృద్ధి పనులతో కళకళలాడిన చెన్నూర్ నేడు అనాథైపోయిందన్నారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో నేను తెచ్చిన నిధులతో ఇప్పుడు ఎమ్మెల్యే వివేక్ శంకుస్థాపనలు చేసుకుంటూ తిరుగుతున్నారు తప్పితే.. ఒక్క రూపాయి కూడా లాభం చేయలేదన్నారు. మంత్రిపదవి కోసం తిరుగుతూ జనాలను పట్టించుకోవడమే మర్చిపోయారన్నారు. చెన్నూర్‌లో ఇసుక దందా అంటూ నాపై ఆరోపణలు చేశారని, అసత్యాలతో జనాలను మోసం చేశారని మండిపడ్డారు. అప్పుడు ఇసుక దందా నడిస్తే.. మరి ఇప్పుడు ఎందుకు లారీలు, క్వారీలు బంద్ కావడం లేదో వివేక్ చెప్పాలన్నారు. కొత్త పనులు తేకపోగా బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన పనులను క్యాన్సిల్ చేయించడం దుర్మార్గమన్నారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే చెన్నూర్ లిఫ్ట్‌ను ఎందుకు పక్కన పెట్టారో చెప్పాలన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్‌దే అధికారం అన్నారు. సర్కార్‌ను ప్రశ్నించే బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ సోషల్ మీడియా యువకులపై అక్రమ కేసులు పెడుతున్నారని బాల్క సుమన్ అన్నారు. ఇలాంటి కేసులు ఎన్ని పెట్టినా భయపడేది లేదన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేశ్, పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు రవీందర్, నాయకులు బడికెల సంపత్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్, చిత్రంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## కేసులకు భయపడేది లేదు

బెల్లంపల్లి, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ బారి నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కదం తొక్కాలని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ ఏరియాలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన జరిగిన రజతోత్సవ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి మూడు వేల మంది నాయకులు, కార్యకర్తలను తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మేలో సభ్యత్వ నమోదు, జూన్‌లో కమిటీల ఏర్పాటు, జూలైలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, బీఆర్ఎస్ క్యాడర్‌కు కేసులు కొత్తేమీ కాదని, భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా, పారదర్శకంగా పోలీస్ వ్యవస్థ పని చేయాలని సూచించారు. ఇకనైనా మారాలని, లేదంటే మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలను కలుపుకుని రామగుండం కమిషనరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ తొంగల సత్యానారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, ఏడు మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, టీబీజీకేఎస్ నాయకులు వెంకటరమణ, బడికల రమేశ్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

### చంద్రబాబు, బీజేపీ డైరెక్షన్‌లో రేవంత్‌రెడ్డి పాలన

- తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు కుట్రలు
- పంటలు ఎండిపోతున్నా పట్టించుకున్నోడు లేడు
- ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలం
- కాంగ్రెస్ లీడర్ల జేబులు నింపేందుకే రాజీవ్ యువ వికాసం
- సమస్యలపై పోరాటం కొనసాగిస్తూనే ఉంటాం
- ప్రజలంతా కేసీఆర్, బీఆర్ఎస్ వైపు చూస్తున్నరు
- ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు
- బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశాల్లో జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య

మంచిర్యాల, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను పండుగలా నిర్వహిస్తామని, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి మూడు వేల మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలను సభకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, బీజేపీ డైరెక్షన్‌లోనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు మెప్పుకోసమే గోదావరి, కృష్ణా నదీ జలాలను ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, ప్రాణహిత నీళ్లను ఏపీకి తరలించేందుకే మేడిగడ్డ వద్ద కుంగిన పిల్లర్‌కు మరమ్మతు చేయడం లేదంటూ మండిపడ్డారు. కేంద్రంలో బడా బాయ్, తెలంగాణలో చోటా బాయ్ ఇద్దరూ ఆంధ్రాబాయ్ చంద్రబాబుతో కలిసి తెలంగాణను నాశనం చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని బీజేపీ లీడర్లకు కాంగ్రెస్ సర్కారు ఆగడాలు ఎందుకు కనిపించడం లేదో ఆలోచించాలన్నారు. ఆనాడు ప్ర పంచ బ్యాంకు ఏజెంటుగా మారిన చంద్రబాబు నాయుడు తెలంగాణ ప్రాంతానికి తీరని నష్టం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్న తరుణంలో కేసీఆర్ టీ(బీ)ఆర్ఎస్‌ను స్థాపించి.. 14 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేసి.. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచిందన్నారు. 2001కు ముందు రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో ఎలాంటి దుస్థితి ఉండేనో, ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక అలాంటి దారుణమైన పరిస్థితులే తెలంగాణలో ఉన్నాయన్నారు. పచ్చబడ్డ తెలంగాణలో నేడు పంట పొలాలు ఎండిపోతున్నాయని, పట్టించుకున్నోడు లేడని మండిపడ్డారు. నీరులేక పంటలను మూగ జీవాలకు మేతగా వదిలేసే దుస్థితి నెలకొందన్నారు. రుణమాఫీ పూర్తిగా కాలేదని, రైతుబంధు రాలేదని, కల్యాణలక్ష్మి రూ. లక్ష, తులం బంగారానికి దిక్కులేదని, నాలుగు వేల పింఛన్ రాలేదన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో సర్కారు పూర్తిగా విఫలమైపోయిందన్నారు. రాజీవ్ యువ వికాసం కేవలం కాంగ్రెస్ పార్టీ లీడర్ల జేబులు నింపే కార్యక్రమమే అంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తున్నదని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తూనే ఉంటామన్నారు. లగచర్ల భూములు గుంజుకునేందుకు లంబాడాలను చిత్రహింసలు పెట్టారని, హెచ్‌సీయూలో 400 ఎకరాలు కబ్జా చేసేందుకు విద్యార్థులపై లాఠీ చార్జీ చేశారని, హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చేశారని మండిపడ్డారు. వీటన్నింటిపై బీఆర్ఎస్ చేసిన పోరాటంతో సర్కారు వెనక్కి తగ్గిందన్నారు.

## మంచిర్యాలలో లా అండ్ ఆర్డర్ విఫలం

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 7 : మంచిర్యాలలో గడిచిన 15 నెలల్లో దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని, ఈ విషయంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉన్నదని, ఇక్కడ లాఅండ్‌ఆర్డర్ విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. మంచిర్యాలలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసం వద్ద ఏర్పాటు చేసిన అసెంబ్లీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. రజతోత్సవ సభలో కాంగ్రెస్ ఆరుగ్యారెంటీల అమలుపై ప్రశ్నిస్తామని, అలాగే బీజేపీ రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాలపై నిలదీసి మరో పోరాటానికి కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారని తెలిపారు. కొత్తగా వచ్చిన సీపీ మంచిర్యాలలో జరుగుతున్న ఆగడాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులు, కేసులకు భయపడేది లేదని, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కొందరు వ్యక్తులు పనిగట్టుకుని బాల్క సుమన్ ఇక్కడి నుంచి పోటీచేయడని, వేరే ప్రాంతానికి వెళ్లిపోతాడని దుష్ప్రచారం చేస్తున్నారని, తాను చెన్నూరు నుంచే బరిలో ఉంటానని స్పష్టం చేశారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ 15 నెలల్లోనే ఏ ప్రభుత్వంపై రానంత వ్యతిరేకత కేవలం ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపైనే వచ్చిందని, కాంగ్రెస్ వద్దు, బీఆర్ఎస్సే ముద్దు అని ప్రజలు అంటున్నారన్నారు. దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు అధికమయ్యాయని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని విశృంఖలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పోలీసు వ్యవస్థ కిమ్మనకుండా ఉండడం సరికాదని, ఇంతటి భయానక పరిస్థితులకు సైతం ఎదురొడ్డి నిలుస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఇక్కడ జరుగుతున్న అరాచకాలన్నింటినీ డైరీలో రాసుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు పెంట రాజయ్య, నల్మాసు కాంతయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్లు తిప్పని లింగయ్య, శ్రీనివాస రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజిత్ రావు, గోగుల రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సందెల వెంకటేశ్, గాదెసత్యం, అంకం నరేశ్, తోట తిరుపతి పాల్గొన్నారు.

## భగీరథ నీరొచ్చింది

### గిరి గ్రామాల్లో సరఫరా

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**



బందర్‌గూడలో మిషన్ భగీరథ నీటిని పడుతున్న గిరిజన మహిళ

తిర్యాణి,ఏప్రిల్ 7: మండలంలోని గుండాల, మంగీ, తాటిగూడ, గోపెర, లంబాడీతండా, గోవెన, కొలాంగూడ, కుర్సుగూడ, భీంరాళ్ల, బందర్‌గూడ, మొర్రిగూడ, లోహ, తోయరేటి, మగర్‌మోడీ, దోంగుర్‌గాం, బోర్ధం తదితర గ్రామాల్లో తాగు నీటి కోసం గిరిజనులు అవస్థలు పడుతుండగా, సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'దాహం తీరేదెట్లా' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు స్పందించారు. సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి ఇబ్బందులు తెలుసుకున్నారు. అప్పటికప్పుడు మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేసి దాదాపు అన్ని గ్రామాలకు తాగు నీరు సరఫరా చేశారు. త్వరలో గోవెన గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కాగా, తాగు నీరందేలా కృషి చేసిన 'నమస్తే తెలంగాణ' పత్రికకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ 7 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్, జన్నారం, హాజీపూర్, భీమిని, మందమర్రి, మంచిర్యాల, క్యాతనపల్లి, రేండ్లగూడ, లక్షెట్టిపేట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



హాజరైన కార్యకర్తలు

## కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం




మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆయన మట్లాడారు. ఊరూరా బీఆర్ఎస్ పార్టీ జెండాలు ఎగరేసి రజతోత్సవ సభకు బయలుదేరాలని సూచించారు. కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అదే సమయంలో కాంగ్రెస్ హామీల పేరిట చేసిన మోసాలను ఎండగట్టాలన్నారు. అనంతరం పట్టణంలోని నౌగంబస్తీలో జరిగిన హనుమాన్ స్వాముల భిక్షలో పాల్గొని భోజనం వడ్డించారు. బీఆర్ఎస్ కార్యకర్త మహమూద్ తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నియోజవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరి బాధ్యత

### ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 7 : ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకునిపై ఉందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మెన్ జనార్దన్‌రాథోడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారని, ప్రతి గ్రామంలో అవగాహన కల్పించి పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## దరఖాస్తులపై సత్వరమే స్పందించాలి

### ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 7 : ప్రజావాణి దరఖాస్తులపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి సమస్యలు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కులగణన సర్వే డబ్బులిప్పించరూ..**

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 7 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేకు సంబంధించిన డబ్బులు ఇప్పించాలని సమగ్ర కుటుంబ సర్వే ఆపరేటర్లు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుల గణన సర్వే పూర్తయి సుమారు నాలుగు నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు కలెక్టర్ స్పందించి నెలలోగా నిధులు వచ్చేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు మాట్ల అనిల్, నెల్లి రవి, గడ్డల ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతిపత్రం ఇస్తున్న సమగ్ర కుటుంబ సర్వే ఆపరేటర్లు